


64,312 క్యూసెక్కులు విడుదల

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 65,756 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 64,312 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లి రూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 1516 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 40 క్యూసెక్కులు వదిలారు.



నిత్యాన్నదానానికి విరాళం

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి గుంటూరుకి చెందిన ఇనుకొల్లు సునీల్‌కుమార్, హారిక దంపతులు రూ. 1,11,111 అందజేశారు.

న్యూస్‌రీల్

చంద్రప్రభ వాహనంపై నారసింహుడు



మంగళగిరి: పట్టణంలో శ్రీ లక్ష్మీనృసింహ స్వామి గ్రామోత్సవం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు.చంద్రప్రభ వాహనంపై శ్రీదేవి భూదేవి సమేతుడైన శ్రీవారిని భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. టెంకాయలు కొట్టి నైవేద్యాలు అందజేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవాన్ని ఆలయ ఈవో ఏ. రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. ఉత్సవ కైంకర్యపరులు గంజి చిరంజీవి, గంజి రవీంద్రనాథ్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇసుక సీనరేజీ ఆదాయాన్ని జెడ్పీకి జమ చేయాలి

– చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా



గుంటూరు ఎడ్యుకేషన్: జెడ్పీకి రావాల్సిన ఇసుక సీనరేజీ ఆదాయాన్ని సక్రమంగా జమ చేసేలా చూడాలని చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా తెలిపారు. జెడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం ఇసుక, భూగర్భ జలవనరుల సీనరేజీతో పాటు స్టాంప్ డ్యూటీ సర్‌చార్జీపై గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు చెందిన ఆయా శాఖల అధికారులతో తన చాంబర్‌లో సమావేశమయ్యారు. గత రెండు ఆర్థిక సంవత్సరాలుగా ఇసుక, మినరల్స్, స్టాంప్ డ్యూటీ సర్‌చార్జీ నుంచి జెడ్పీకి రావడం లేదని, తక్షణమే నిధులు జమ చేసే విధంగా చర్యలు చేపట్టాలని అధికారుల్ని ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈవో వి. జ్యోతిబసు, డెప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ, ఆయా శాఖల అధికారులు, జెడ్పీ ఏవోలు పాల్గొన్నారు.

వీధి బాలల హక్కులను కాపాడాలి

జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ


గుంటూరు వెస్ట్: వీధి బాలల్ని గుర్తించి వారిని పునరావాస కేంద్రాలకు పంపే విధంగా కృషి చేయాలని జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని డీఆర్సీ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు బాలలకు మంచి భవిష్యత్తును అందించాలని చెప్పారు. ఈ నెల, వచ్చే నెలల్లో వీధి బాలల్ని గుర్తించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజనా సిన్హా, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

పలు రైళ్లు రద్దు



లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు రైల్వే డివిజన్ పరిధిలో అభివృద్ధి పనుల నేపథ్యంలో పలు రైళ్లను రద్దు చేసినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం ప్రదీప్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబర్ 07791 (కాచిగూడ-నడికుడి) 07792 (నడికుడి-కాచిగూడ)ను నవంబర్ 1వ తేదీ నుంచి 30 వరకు రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు సహకరించాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయిని మృతి



వినుకొండ(నూజెండ్ల): రోడ్డు ప్రమాదంలో ప్రభుత్వ ఉపాధ్యాయిని మృతి చెందిన సంఘటన వినుకొండ రూరల్ మండలం నాగులవరం సమీపంలో శుక్రవారం జరిగింది. బాపట్ల జిల్లా అద్దంకి పట్టణానికి చెందిన కొత్తమాస ధనలక్ష్మి (41) వినుకొండ రూరల్ మండలం గోకనకొండ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తుంది. విధుల్లో భాగంగా ఉదయాన్నే మరో ఉపాధ్యాయుడు ద్విచక్రవాహనంపై పాఠశాలకు వస్తుండగా నాగులవరం సమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తూ బండిపై నుంచి జారి పడటంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటనలో ఆమె అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలికి భర్త నాగేశ్వరరావు, ఒక బాబు ఉన్నాడు. వినుకొండ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శనగ రైతుకు సెగ

- విత్తన రాయితీకి కూటమి ప్రభుత్వం కోత
- ఎకరాకు 25 శాతానికి కుదింపు
- బహిరంగ మార్కెట్ కన్నా ధర అధికం
- పెట్టుబడి సాయానికి కూడా ఎగనామం
- సాగుకు చేతిలో పైసా కరువు
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు



రైతు సేవా కేంద్రాలకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న శనగ విత్తన బస్తాలు

కొరిటెపాడు(గుంటూరు): అన్నదాతలకు శనగ విత్తనాల కొనుగోలు భారంగా మారింది. సాగుకు పెట్టుబడి సాయం అందిస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం నిలువునా మోసం చేసింది. జూలైలో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో సుమారు 12 వేల ఎకరాల్లో వెద పద్ధతిలో సాగు చేసిన వరికి నష్టం వాటిల్లింది. పంట నష్టపరిహారం ఇవ్వకుండా ప్రభుత్వం మొహం చాటేసింది. రాయితీ విత్తనాలతోనే సరి పెట్టింది. తిరిగి ఆగస్టు చివరిలో కురిసిన భారీ వర్షాలకు జిల్లాలో సుమారు 50 వేల ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. దీనికి తోడు ఇప్పుడు పులి మీద పుట్రలా శనగ విత్తనాలపై రాయితీని కుదించింది. భారీ వర్షాల కారణంగా పంటలు నష్టపోయి ఇప్పటికే రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం సబ్సిడీ మరింత పెంచి విత్తనాలు అందించాల్సి ఉంది. అయితే, కూటమి ప్రభుత్వం కుదించడంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఒక్కో రైతుకు రెండు క్వింటాళ్లు

రబీలో శనగ సాగు చేసే రైతులకు 25 శాతం సబ్సిడీతో విత్తనాలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. బహిరంగ మార్కెట్‌లో క్వింటా ధర రూ.7 వేల నుంచి రూ.7,500 వరకు ధర పలుకుతోంది. అయితే, ప్రభుత్వం మాత్రం రూ.9,400, రూ.12,100 ధరలను పెట్టింది. జేజే-11 క్వింటా పూర్తి ధర రూ.9,400 కాగా అందులో 25 శాతం రాయితీ రూ.2,350 పోను రూ.7,050ను రైతులు చెల్లించాల్సి ఉంటుంది. కాక్-2 రకం క్వింటా ధర రూ.12,100 ఉండగా.. రాయితీ రూ.3,025 పోనూ రూ.9,075 చెల్లించాలి. ఒక్కో రైతుకు గరిష్ఠంగా 200 కిలోలు అంటే రెండు క్వింటాళ్లు పంపిణీ చేయనున్నారు. ఒక ఎకరా ఉన్న రైతుకు 40 కిలోలు, రెండు ఎకరాలు ఉన్న రైతుకు 80 కిలోలు పంపిణీ చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

రైతాంగంపై సబ్సిడీ భారం

ఇప్పటికే రెండుసార్లు భారీ వర్షాలకు పంటలు నష్టపోయి రైతులు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం శనగ విత్తన సబ్సిడీలో కోత విధించడంతో తీవ్ర అవస్థలు పడుతున్నారు. జిల్లాలో ప్రత్తిపాడు, పెదనందిపాడు, కాకుమాను, తాడికొండ, వట్టిచెరుకూరు, తుళ్ళూరు, ఫిరంగిపురం మండలాల్లో 7,970 హెక్టార్లలో రైతులు శనగ పంట సాగు చేయనున్నారు. ఇందు కోసం 8,000 క్వింటాళ్లు అవసరమని ఇండెంట్ పెట్టగా, 6,154 మాత్రమే జిల్లాకు మంజూరైనట్లు వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో 40 శాతం రాయితీ

గత రబీ సీజన్‌లో అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసింది. ఏటా క్రమం తప్పకుండా రైతు భరోసా–పీఎం కిసాన్ అందించింది. విపత్తుల వల్ల పంటలు నష్టపోతే అదే నెలలో పరిహారం కూడా మంజూరు చేసింది. రబీలో విత్తన శనగపై 40 శాతం రాయితీ అందించి, రైతుల సంక్షేమానికి చర్యలు తీసుకుంది. అప్పట్లో క్వింటా శనగ రూ.8,100 కాగా.. అందులో 40 శాతం అంటే రూ.3,240 పోనూ రైతుల వాటా కింద రూ.4,680 ప్రకారం కట్టించుకున్నారు.

25 శాతం సబ్సిడీతో పంపిణీ



ప్రభుత్వం నిర్ణయించిన మేరకు అర్హులైన రైతులందరికీ 25 శాతం సబ్సిడీతో శనగ విత్తనాలు అందిస్తున్నాం. ఆయా రైతు సేవా కేంద్రాలకు చేరుస్తున్నాం. రైతు సేవా కేంద్రాల్లో డీ–క్రిష్ యాప్ ద్వారా పేర్లు నమోదు చేసుకున్న రైతులకు విత్తనాలు అందిస్తాం.

–నున్న వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి, గుంటూరు



హై జంప్‌లో సత్తా చాటుతున్న క్రీడాకారిణి



క్రీడోత్సాహం

వంద మీటర్ల పరుగు పందెంలో బాలురు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. రెండో రోజు శుక్రవారం విజయమే లక్ష్యంగా జూనియర్ అథ్లెట్లు వివిధ అంశాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. అండర్ - 18 బాలుర 200 మీటర్లు, 1000 మీటర్ల పరుగులో ఆంధ్రప్రదేశ్ అథ్లెట్లు స్వర్ణ పతకాలు సాధించారు. - ఏఎన్‌యూ

డ్రగ్స్ కలకలం



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్, పక్కన డీఎస్పీ అబ్దుల్ అజీజ్, సీఐ వీరయ్య

డగ్స్ పీల్చే ఇద్దరు యువకుల అరెస్టు

- 66.26 గ్రాముల ఎండీఎంఏ పట్టివేత
- 'ఎల్‌ఈడీ లైట్'లో సరఫరా
- బెంగళూరు– గుంటూరుకు ప్రైవేటు బస్‌లో రవాణా

నగరంపాలెం: డ్రగ్స్ పీల్చే ఇద్దరి యువకులను కొత్తపేట పోలీసులు అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. లక్ష రూపాయలు ఖరీదు చేసే ఎండీఎంఏ డ్రగ్, మొబైల్ ఫోన్లు, మత్తు పీల్చే ట్యూబ్‌లు, ఐప్యాడ్, పోర్టబుల్ ఎలక్ట్రానిక్ వెయింగ్ యంత్రాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో ఎస్పీ మాట్లాడారు. ముందస్తు సమాచారంతో గురువారం రాత్రి కొత్తపేట పీఎస్ సీఐ ఎం. వీరయ్య, సిబ్బందితో పాత్తూరివారితోట ఐదో వీధిలోకెళ్లారు. ఇద్దరు యువకులు వీరిని చూసి పరారవుతుండగా, పోలీసులు వెంటబడి పట్టుకున్నారు. ఇద్దరినీ ఇన్నర్ రింగ్ రోడ్డు శర్నల ప్యాలెస్ ప్లాట్ నంబర్ 301లో ఉండే షేక్ యూసుఫ్ షరీఫ్, బ్రాడీపేట బీఈడీ కళాశాల కాంపౌండ్‌లో ఉంటున్న బట్టు డోనాల్డ్ అలియాస్ టోనిగా గుర్తించారు. కేసు విచారణ అనంతరం ఇద్దర్ని అరెస్ట్ చేసి, లక్ష రూపాయాలు విలువ చేసే ఎండీఎంఏ డ్రగ్, ఇతరత్రా పరికరాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ చెప్పారు.

ఇద్దరూ స్నేహితులే..

బట్టు డోనాల్డ్ అలియాస్ టోని డీజేకి వెళ్లేవాడు. ఇక యూసుఫ్ షరీఫ్ గతంలో బెంగుళూరులోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేయగా, ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. వీరిద్దరూ స్నేహితులు. యూసుఫ్ షరీఫ్ బెంగళూరులో పరిచయమైన వ్యక్తి ద్వారా ఎండీఎంఏ డ్రగ్ తాగేవాడు. దీంతో ఉద్యోగం నుంచి తొలగించగా, గుంటూరు వచ్చేశాడు. వీరికి హైదరాబాద్‌లో హోటల్స్ వ్యాపారం చేస్తూ డ్రగ్స్ తీసుకునే స్నేహితులు ఉన్నారు. యూసుఫ్ ద్వారా డ్రగ్స్ తెప్పించి వీరంతా తాగేవారు. ఇటీవల హైదరాబాద్‌లోని స్నేహితులు లక్ష రూపాయలు యూసుఫ్ షరీఫ్‌కు పంపించారు. దీంతో అతను రూ.75 వేలను బెంగళూరులోని వ్యక్తికి పంపించాడు. అతడు బుధవారం రాత్రి బెంగుళూరు నుంచి డ్రగ్‌ను ఎల్‌ఈడీ లైట్‌లో దాచి, ఓ ప్రైవేటు బస్‌లో గుంటూరు పంపించాడు. గురువారం ఆ డ్రగ్‌ను యూసుఫ్ షరీఫ్ తీసుకుని హైదరాబాద్‌లోని స్నేహితులకు పంపించేందుకు సిద్ధమయ్యాడు. అయితే, కొంత డ్రగ్‌ను టోనికి యిచ్చే క్రమంలో వారిద్దరూ పట్టుబడ్డారు. ఇద్దర్ని రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు.

బెంగళూరుకు ప్రత్యేక బృందం

బెంగళూరులో ఎండీఎంఏ డ్రగ్ సరఫరా చేసే వ్యక్తి ఆచూకీ కోసం ప్రత్యేక బృందాన్ని పంపించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. హైదరాబాద్‌లో డ్రగ్ పీల్చే స్నేహితులు ఎవరా అనేది ? ఆరా తీస్తున్నట్లు చెప్పారు. ఈ డ్రగ్ తాగడం మినహా విక్రయించే వారు కాదని, గతంలో రెండుసార్లు పోలీసులకు పట్టుబడ్డారని తెలిపారు. కేసుని చాకచక్యంగా ఛేదించిన కొత్తపేట పీఎస్ సీఐ వీరయ్య, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. సమావేశంలో తూర్పు సబ్ డివిజన్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్ పాల్గొన్నారు.



డ్రగ్ పరికరాలు, మొబైల్ ఫోన్లు

రైలు కింద పడి ప్రేమజంట ఆత్మహత్య

- కులాంతర వివాహానికి ఒప్పుకోని పెద్దలు
- పెదకాకానిలో రైల్వే ట్రాక్‌పై బలవన్మరణం



మహేష్, శైలజ (ఫైల్)

పెదకాకాని : పెళ్లికి పెద్దలు అంగీకరించలేదని ఓ ప్రేమజంట శుక్రవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంది. గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన దానబోయిన సాంబశివరావు దంపతుల చిన్న కుమారుడు మహేష్(22) రెండేళ్లుగా హైదరాబాద్‌లోని ఓ సెల్‌ఫోన్ షోరూంలో పని చేస్తున్నాడు. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం రుద్రవరం గ్రామానికి చెందిన నంద్రు వెంకయ్య, విజయ దంపతులకు ముగ్గురు ఆడపిల్లలు. చిన్న కుమార్తె శైలజ కూడా అదే సెల్‌ఫోన్ షోరూంలో ఉద్యోగంలో చేరింది. మహేష్, శైలజల మధ్య పరిచయం కాస్త ప్రేమగా మారింది. వారి కులాలు వేరు కావడంతో పెళ్లికి పెద్దలు అంగీకరించలేదు. కొంత కాలం కిందట హైదరాబాద్ నుంచి శైలజ తిరిగొచ్చి గుంటూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తోంది. ఇదిలా ఉండగా, ఈ నెల 10వ తేదీన ఆస్పత్రికి వెళ్లిన శైలజ ఫోన్ స్విచ్ఛాఫ్ అయింది. దీంతో వారం కిందట నందిగామ పోలీసులకు తల్లి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే వారం కిందట ఇంటి నుంచి కొంత నగదుతో బయటకెళ్లిన మహేష్ తిరిగి రాలేదు. శుక్రవారం తెల్లవారుజామున ఐదు గంటల సమయంలో ఇద్దరూ బైక్‌పై పెదకాకాని భ్రమరాంబపురం ఆర్చి సమీపంలో రైల్వే ట్రాక్ వద్దకు చేరుకున్నారు. బైక్, వారి వద్ద ఉన్న బ్యాగ్‌లు అక్కడే పెట్టి ఇద్దరూ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నారు. స్థానికుల సమాచారం మేరకు మహేష్ కుటుంబ సభ్యులు, బంధువులు అక్కడికి చేరుకున్నారు. ఘటనా స్థలాన్ని రైల్వే సీఐ అంజిబాబు, ఎస్ఐ రమేష్‌లు పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

కప్పం కట్టు లేదా వాటా ఇవ్వు !

- మద్యం దుకాణదారులకు హుకుం జారీ చేసిన మంత్రి పీఏ
- రూ. కోటికి పైగా పలుకుతున్న దుకాణ లైసెన్స్
- మంత్రి ఒత్తిడి తట్టుకోలేక విక్రయిస్తున్న లైసెన్స్‌దారులు
- దుకాణాలు తెరిచేందుకు జంకుతున్న వ్యాపారులు



మంగళగిరిలో ఓ దుకాణం వద్ద బారులుతీరిన మందు బాబులు

మంగళగిరి: స్థానిక మద్యం వ్యాపారులు బెదిరింపులతో భయపడిపోతున్నారు. వ్యాపారం సక్రమంగా జరగాలంటే కప్పం కట్టాలి లేదా సగం వాటా ఇవ్వాలంటూ మంత్రి పీఏ నుంచి బెదిరింపులు రావడంతో తలలు పట్టుకుంటున్నారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో 19 మద్యం దుకాణాలున్నాయి. లాటరీలో దుకాణాలను దక్కించుకునేందుకు వ్యాపారులు అత్యధికంగా లైసెన్స్ ఫీజులు చెల్లించారు. వంద లైసెన్స్ ఫీజులు చెల్లించిన వారికి సైతం రెండు, మూడు దుకాణాలే దక్కాయి. కొందరికి ఒకటి మాత్రమే వచ్చింది. మరికొందరికి అసలు రాకపోవడంతో కట్టిన లైసెన్స్‌లు ఫీజులు నష్టపోయారు. కోట్ల రూపాయలు చెల్లించి ఒకటి రెండు దుకాణాలు దక్కించుకున్న వారికి సైతం మంత్రి పీఏ నుంచి ఫోన్‌లు వస్తుండడంతో ఏమి సమాధానం చెప్పాలో తెలియక కొట్టుమిట్టాడుతున్నారు. దుకాణాలలో వాటా ఇవ్వకుంటే రూ. 20 లక్షల నుంచి రూ. 30లక్షలు నగదు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసినట్లు వ్యాపారుల్లో జోరుగా చర్చ జరుగుతోంది. ఈ పరిస్థితుల్లో గట్టెక్కగలమా ? అని ఆలోచిస్తున్న కొందరు దుకాణదారులు లైసెన్స్‌లు అమ్ముకుని బయటపడేందుకు చూస్తున్నారు. ఇప్పటికే నగరంలో మూడు దుకాణాలు దక్కించుకున్న లైసెన్స్‌దారులు ఒక్కో దాన్ని రూ.కోటికి పైగా విక్రయించి సొమ్ము చేసుకున్నట్లు వ్యాపారులు చెబుతున్నారు. మద్యం వ్యాపారంలో కోట్లు గడించవచ్చని భావించిన వ్యాపారులకు చినబాబు కార్యాలయం నుంచి వస్తున్న బెదిరింపులతో వారి ఆశలు ఆడియాసలుగా మారాయి. కొందరు ఈ తలనొప్పి ఎందుకని వ్యాపారం నుంచి మెల్లిగా పక్కకు తప్పుకుంటున్నారంటే పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థమవుతుంది.

నేనే అభ్యర్థినంటూ వెల్లడమెందుకు?

- ఓటర్ల నమోదు .. పార్టీ నాయకుల బాధ్యత కాదా ?
- అభ్యర్థిత్వం ప్రకటనకు అభిప్రాయాలు అవసరం
- గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిపై చంద్రబాబు

సాక్షి, విజయవాడ: కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి తానే పోటీదారునంటూ వెల్లడమెందుకు, అభ్యర్థిత్వం ఖరారు కానప్పుడు అలా చెప్పుకోవడం ఎందుకు ? అని చంద్రబాబు ప్రశ్నించడంతో ఖంగుతినడం నాయకులవంతయ్యింది. రెండు జిల్లాల్లోని ముఖ్యులతో మాట్లాడకుండానే అభ్యర్థిని నిర్ణయించేద్దామా అని స్వరం పెంచడంతో ఎవరికీ మాట పెగల్లేదు. పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం నుంచి ఎన్నికల్లో పోటీకి గుంటూరు జిల్లా తెనాలికి చెందిన నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్ సిద్ధమయ్యారని, ఆయన పేరును ప్రకటిస్తే సరిపోతుందని శుక్రవారం పార్టీ ప్రధాన కార్యాలయంలో తనను కలిసిన ఒకరిద్దరు నాయకులు ప్రస్తావించడంతో చంద్రబాబు పైవిధంగా స్పందించారని విశ్వసనీయ సమాచారం. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి టీడీపీ నుంచి తాను పోటీలో ఉన్నట్లు ఆలపాటి ప్రచారాన్ని వేగవంతం చేయడం స్వపక్షంతో పాటు కూటమిలోని పలువురు ముఖ్య నాయకులకు నచ్చడం లేదు. పట్టభద్రుల ఓటర్లను చేర్పించే మిషతో ఆలపాటి వ్యూహాత్మకంగా ముందుకు వెళ్తున్న విషయాన్ని పార్టీలోని ఆయన వ్యతిరేకవర్గం అధిష్టానం దృష్టికి తీసుకెళ్లింది. కూటమిలో చర్చకు దారి తీసిన ఈ అంశంపై స్పష్టత ఇస్తే బాగుంటుందనే ఉద్దేశంతో చంద్రబాబు వద్ద ప్రస్తావించగా ఆయన ఘాటుగా స్పందించిన తీరు గుంటూరు, కృష్ణా జిల్లాల పార్టీ నేతల మధ్య హాట్ టాపిక్‌గా మారిందని సమాచారం.

మారు మాట్లాడని నాయకులు

ఎన్నికల్లో పోటీ ఎవరు చేస్తారనేది అటుంచితే ఓటర్లను నమోదు చేయించాల్సిన బాధ్యత పార్టీలోని నాయకులు అందరిదీ. ప్రతి నియోజకవర్గంలోని వారు చొరవ తీసుకుని ఆ పని చేయాలి. ఎవరికి వారు వ్యక్తిగతంగా తీసుకోవడమో, ఓ నాయకుడికి మద్దతుగా మాట్లాడటమో ఏమాత్రం సరికాదని బాబు అనడంతో ఆయన ఎదుట ఉన్న నాయకులు మారు మాటాడలేదని తెలిసింది. అభ్యర్థిత్వం ప్రకటించాలంటే రెండు జిల్లాల్లోని ముఖ్యులతో పాటు ఇతర వర్గాల ద్వారా అభిప్రాయాలు సేకరించాలి. సానుకూలత ఏమేరకు ఉందనేది అంచనా వేసుకోవాలి. పైగా కూటమిలోని ముఖ్యులతో సంప్రదింపులు జరపాలి. ఓ అభిప్రాయానికి రావాలి. ఎమ్మెల్సీ స్థానానికి పోటీ చేయడానికి చాలామంది ముందుకు వస్తున్నారు. అన్నీ సర్దుబాటు చేసుకున్నాక నిర్ణయం తీసుకుందామని బాబు అనడం రెండు జిల్లాల నాయకులను ఆలోచనల్లో పడేసినట్లయింది.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **4,000** గరిష్ఠం : రూ. **5,500**

మోడల్ ధర రూ. **4,800**

క్లుప్తంగా

నేడు శివాలయంలో హుండీల కానుకలు లెక్కింపు

పెదకాకాని: శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో హుండీల కానుకలు లెక్కింపును శనివారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు డీసీ గోగినేని లీలాకుమార్ తెలియజేశారు. లెక్కింపునకు ఆలయ కల్యాణ మండపంలో సీసీ కెమెరాలు ఏర్పాట్లు చేశామని, సేవాసమితి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొంటారని పేర్కొన్నారు. దేవదాయ శాఖ నిబంధనల మేరకు భక్తులు కూడా పాల్గొనవచ్చని ఆయన తెలిపారు.

యార్డులో 50,503 బస్తాల మిర్చి విక్రయం



కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 43,523 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 50,503 అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.8,200 నుంచి రూ. 16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.8,000 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం రూ. 8,500 నుంచి రూ. 17,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,000 నుంచి రూ. 18,200 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.11,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 19,806 బస్తాల నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సత్తా చాటిన ఏపీ అథ్లెట్లు

- రెండు విభాగాల్లో స్వర్ణం
- ఏఎన్‌యూలో కొనసాగుతున్న పోటీలు



వంద మీటర్ల పరుగు పందెంలో పోటీ పడుతున్న బాలికలు

ఏఎన్‌యూ: సౌత్‌జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భాగంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో రెండో రోజైన శనివారం రెండు అంశాల్లో ఆంధ్రప్రదేశ్ అథ్లెట్లు స్వర్ణ పతకాలు సాధించారు. అండర్ – 18 బాలుర 200 మీటర్ల పరుగులో ఆంధ్రప్రదేశ్ అథ్లెట్ శేషు దుడ్డు మొదటి స్థానంలో నిలిచి బంగారు పతకం సొంతం చేసుకున్నాడు. ఈ అంశంలో చిరంత్ పి (కర్నాటక) రెండో స్థానంలోను, చిరాగ్(కర్నాటక) మూడో స్థానంలో నిలిచారు. అండర్ – 18 1000 మీటర్ల పరుగులో ఏపీ అథ్లెట్ మొగలి వెంకట్రామ్‌రెడ్డి బంగారు పతకాన్ని సొంతం చేసుకున్నాడు. మహేష్ సల్లా(తెలంగాణ) రెండో స్థానంలోను , ప్రియన్ ఆర్. రాజా(తమిళనాడు) మూడో స్థానంలోను నిలిచారు. రెండో రోజు విజయమే లక్ష్యంగా జూనియర్ అథెట్లు వివిధ అంశాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. పలు పోటీల్లో మొదటి, రెండవ, మూడవ స్థానాల్లో నిలిచిన వారి వివరాలు వరుసగా...

అండర్ – 20 కేటగిరి

పురుషుల 200 మీటర్ల పరుగులో రోహన్ ఎస్ఆర్(కేరళ), సామ్ వసంత్ ఎస్ (తమిళనాడు), శెట్టి లోహిత్(ఏపీ), పురుషుల 10000 మీటర్ల నడకలో విజయ్ సావరట్కర్(కర్నాటక), సుగుమార్ ఎస్(తమిళనాడు), అభినవ్ సోని (కేరళ), పురుషుల హైజంప్‌లో ముఖేష్ అశోక్ కుమార్ (తమిళనాడు), పార్థీవ్ వినోద్(కేరళ), పురుషుల పోల్‌వాల్ట్‌లో తన్నతెన్నరసు ఆర్(తమిళనాడు), రాహుల్ నాయక్(కర్నాటక), అధాత్య వేడియామ్మల్(కర్నాటక). పురుషుల డిస్కస్‌త్రోలో శ్రీశాంత్ వాసన్ ఎస్(తమిళనాడు), వికాస్ దాసరి(ఆంధ్రప్రదేశ్), ఎంఎస్ శ్రీకాంత్(కర్నాటక).

- పురుషుల 4–400 మీటర్ల పరుగులో తమిళనాడు బృందం, తెలంగాణా బృందం, ఆంధ్రప్రదేశ్ బృందం ఉన్నారు.
- మహిళల 200 మీటర్ల పరుగులో శ్రీనా నారాయణన్‌కుట్టి (కేరళ), జీ జానిసీ స్టెల్లా(తమిళనాడు), గుణశ్రీ ఎంఎం(తమిళనాడు), మహిళల పోల్‌వాల్ట్‌లో దీపిక ఎ (తమిళనాడు), బి సౌందర్య బాలకృష్ణన్(తమిళనాడు), బవిత శెట్టి(కర్నాటక) ప్రతిభ చూపారు.
- మహిళల జావాలిన్ త్రోలో జీవిత డి(కర్నాటక), ఐషాని (తమిళనాడు), రాజలక్ష్మి ఆర్(తమిళనాడు). మహిళల హేమర్‌త్రోలో స్పృహ నాయక్ (కర్నాటక), కావ్య ఆర్(తమిళనాడు), వర్ష గౌడ(కర్నాటక) ఉన్నారు.
- మహిళల 4–400 మీటర్ల పరుగులో తమిళనాడు బృందం, కేరళ బృందం, ఆంధ్రప్రదేశ్ బృందం ఉన్నారు.



పోల్‌వాల్ట్‌లో పోటీ పడుతున్న బాలిక



స్టీప్‌చేజ్‌లో బాలికలు

గుంటూరు పశ్చిమలో అత్యధికంగా 19.4 మి.మీ. వర్షం

కొరిటెపాడు(గుంటూరు): జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం వరకు అత్యధికంగా గుంటూరు పశ్చిమలో 19.4 మి.మీ. వర్షం పడగా, అత్యల్పంగా పొన్నూరు మండలంలో 0.2 మి.మీ. పడింది. సగటున 3.4 మి.మీ. నమోదైంది. వివిధ మండలాల్లో నమోదైన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి. చేబ్రోలు 12.6, పెదనందిపాడు 4.8, తెనాలి 4.4, గుంటూరు తూర్పు 4, పెదకాకాని 4, మేడికొండూరు 3.4, తాడికొండ 3.2, ఫిరంగిపురం 2.6, కాకుమాను 2, తుళ్ళూరు మండలంలో 1.2 మి.మీ. చొప్పున వర్షం పడింది. అక్టోబర్ 18వ తేదీ వరకు జిల్లా సాధారణ వర్షపాతం 75.1 మి.మీ. పడాల్సి ఉండగా, ఇప్పటి వరకు 104.8 మి.మీ. నమోదైంది.

ఆసుపత్రుల్లో వైద్యులు అందుబాటులో ఉండాల్సిందే !

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

గుంటూరు వెస్ట్: ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు వారికి కేటాయించిన వేళల్లో అందుబాటులో ఉండాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి హెచ్చరించారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో శుక్రవారం డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్య సేవ జిల్లా క్రమశిక్షణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పేద ప్రజలు ఎంతో నమ్మకంతో ఆసుపత్రులకు వస్తారని, వారి నమ్మకాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని తెలిపారు. రోగులకు నగదు రహిత సేవలు అందించాలని, ఈ క్రమంలో వారికి ఇబ్బందులు కలగకుంగా అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈహెచ్‌ఎస్ పథకంలో భాగంగా ఉద్యోగులకు, పెన్షనర్లకు నగదు రహిత సేవలు అందించేలా నెట్‌వర్క్ ఆసుపత్రులు చర్యలు చేపట్టాలని చెప్పారు. జీజీహెచ్‌పై వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని తెలిపారు. చికిత్స సమయంలో రోగులు ఖర్చుపెట్టిన మొత్తాలను వారం రోజుల లోపు వారికి అందేలా చూడాలని చెప్పారు. ఆసుపత్రులపై మొత్తం 209 ఫిర్యాదులు అందాయని సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ విజయలక్ష్మి, జేడీ అడ్మిన్ డాక్టర్ సుధారాణి, డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎం మజీద, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ సీహెచ్. విజయప్రకాశ్, రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ పి.రామచంద్రరాజు పాల్గొన్నారు.

పసుపు రైతులకు నష్టపరిహారం అందించాలి

దుగ్గిరాల శుభం కోల్డ్ స్టోరేజ్‌లో అగ్ని ప్రమాదంలో దగ్ధమైన పసుపు బస్తాలకు వీలైనంత త్వరగా ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి పరిహారం అందించాలని కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి శుక్రవారం తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజనాసిన్హాతో కలిసి అధికారులతో ఆమె మాట్లాడారు. ఇన్సూరెన్స్ కంపెనీలు, బ్యాంకు అధికారులు, ప్రభుత్వ అధికారులు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రమాదంపై ఇప్పటికే సర్వే పూర్తి చేశారని తెలిపారు. విద్యుత్, అగ్నిమాపక, పోలీస్ తదితర శాఖలతోపాటు కోల్డ్ స్టోరేజ్ యాజమాన్యం నుంచి అవసరమైన డాక్యుమెంట్లు తీసుకుని సోమవారం నాటికి ఇన్సూరెన్స్ కంపెనీ ప్రధాన కార్యాలయానికి ఫైలు అందజేస్తామని కలెక్టర్ చెప్పారు. రైతులు తీవ్రంగా నష్టపోయారని వారిని ఆదుకోవాల్సిన బాధ్యత ఉందని ఆమె స్పష్టం చేశారు.

క్రీడలతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం

డీవైఈఓ వెంకటేశ్వరరావు



విద్యార్థులతో చెస్ ఆడి పోటీలను ప్రారంభిస్తున్న డీవైఈఓ

గుంటూరు ఎడ్యుకేషన్: క్రీడలతో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసంతో పాటు ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని గుంటూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పి.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం చౌత్రా సెంటర్లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో అండర్–14, 17 బాలబాలికల జిల్లాస్థాయి చదరంగ పోటీల్ని నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లాలోని 17 నియోజకవర్గాల నుంచి 340 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా పోటీలను ప్రారంభించిన డీవైఈవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థుల మధ్య ఐకమత్యం వెల్లివిరిసి, ఉన్నత విలువలతో ఎదుగుతారని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ మొహమ్మద్ ఖాసిం మాట్లాడుతూ ఆటపాటలతో కూడినదే సంపూర్ణమైన జీవితం అని అన్నారు. కన్న స్కూల్ డైరెక్టర్ కన్న మాస్టారు మాట్లాడుతూ క్రీడలు మానసిక వికాసాన్ని కలిగిస్తాయని, ప్రతి ఒక్కరు ఏదో ఒక ఆట ఆడి ఆనందాన్ని పొందాలని తెలిపారు. ఆర్‌ఐపీఈ షేక్ మహబూబ్ బాషా మాట్లాడుతూ ఆటలు సమైక్యతను చాటి చెప్పడమే కాకుండా ఉపాధిని కలిగిస్తాయని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్పోర్ట్స్ కోటాలో రెండు శాతం రిజర్వేషన్లు అమలు చేస్తున్నట్లు చెప్పారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి మెల్లంపూడి రవికుమార్ మాట్లాడుతూ క్రీడలు, చదువు విద్యార్థులు జీవితంలో అంతర్భాగం కావాలని సూచించారు. పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థుల్ని జిల్లా జట్టుకు ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో నాగేంద్రమ్మ, వ్యాయామ ఉపాధ్యాయులు సామ్రాజ్యం, రవిశేఖర్, చెస్ ఆర్బిటర్ యం. గోపీనాథ్, పి.సాయిబాబు, యం. భరత్ కుమార్, వివిధ పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాడి పశువుల సంతతి పెంపునకు కృషి

పశుసంవర్ధక శాఖ జిల్లా జేడీ ఓ.నరసింహారావు

తెనాలి: జిల్లాలో పాడి పశువుల సంతతి పెంపునకు కృషి చేస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జిల్లా జేడీ ఓ.నరసింహారావు తెలిపారు. పశువుల్లో కృత్రిమ గర్భధారణకు ప్రస్తుతం అమల్లో ఉన్న లింగ నిర్ధారణ వీర్యం విధానాన్ని పశు పోషకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జిల్లాకు 10 వేల డోసులు లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు చెప్పారు. జిల్లా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా శుక్రవారం ఆయన తెనాలి డివిజన్‌ను సందర్శించారు. స్థానిక బుర్రిపాలెంరోడ్డులోని పశువైద్యశాలను, పెదరావూరులోని డెప్యూటీ డైరెక్టర్ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం అక్కడే తనను కలిసిన మీడియాతో మాట్లాడారు. కృత్రిమ గర్భధారణలో గత రెండేళ్లుగా గొప్ప మార్పులు వచ్చాయని గుర్తుచేశారు. లింగ నిర్ధారణ వీర్యంతో 90 శాతం పెయ్యదూడలు పొందే అవకాశం ఉందని తెలిపారు. తద్వారా పాడి పశువుల సంతతి పెరుగుతూ పాల ఉత్పత్తి అధికం కాగలదని చెప్పారు. పశుపోషకులకు ఎంతో ప్రయోజనకరమైన ఈ పథకంలో లింగ నిర్ధారిత వీర్యం ఒక డోసు రూ.1350 కాగా, ప్రభుత్వం రూ. 850 సబ్సిడీ ఇస్తోందని తెలిపారు. రైతులు కేవలం రూ.500 చెల్లిస్తే సరిపోతుందని చెప్పారు. ఒకవేళ పెయ్య దూడ రాకపోతే రైతుకు రూ.500 తిరిగి చెల్లించే అవకాశం కూడా ఉందని వెల్లడించారు.



నట్టల నివారణ మందును తప్పక వేయించాలి

జిల్లాలో ఈనెల 16వ తేదీ నుంచి గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందును ఇస్తున్నట్లు డాక్టర్ నరసింహారావు చెప్పారు. జిల్లాలో గొర్రెలు 1.25 లక్షలు, మేకలు 20 వేలు ఉన్నాయని తెలిపారు. వీటిలో అంతర్గత పరాన్నజీవులు పెరుగుతుంటాయనీ, ఫలితంగా వ్యాధులకు గురవడమే కాకుండా వ్యాధినిరోధకశక్తి తగ్గుతుందని చెప్పారు. నివారణకు పశువైద్యశాలల్లో నట్టల నివారణ మందును జీవాలకు ఇప్పించాలని సూచించారు. జిల్లాలో రైతుసేవ కేంద్రాల్లోని 213 పశుసంవర్ధకశాఖ సహాయకులు పశువైద్యసేవలను అందిస్తున్నారని గుర్తు చేశారు. కృత్రిమ గర్భధారణ సహా ఇతర సేవలకు పశుపోషకులు సహాయకుల సేవలను కూడా వినియోగించుకోవాలనికోరారు. పశువులకు తీవ్రమైన అనారోగ్యం, ప్రమాదాలు సంభవించినపుడు సంచార అంబులెన్స్‌ల సేవలను రైతులు తప్పనిసరిగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. వీటితోపాటు పెదరావూరు కార్యాలయంలోని నిర్ధారణ కేంద్రంలో పశువుల వ్యాధులను నిర్ధారించుకోవచ్చని వివరించారు. సమావేశంలో డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పద్మావతి, ఏడీలు డాక్టర్ జి.నరేంద్ర, డాక్టర్ రమేష్, వెటరనరీ అసిస్టెంట్ సర్జన్లు డాక్టర్ అబ్దుల్ ముజీర్, డాక్టర్ కావ్య పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయం

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న విజయలక్ష్మి

గుంటూరు మెడికల్: గర్భిణుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా పని చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కొర్రా విజయలక్ష్మి అన్నారు. గర్భిణుల వివరాలు వీలైనంత త్వరగా నమోదు చేయాలని, హైరిస్క్ వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. జిల్లాలోని పట్టణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని సూపర్‌వైజర్లకు శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ప్రతి నెలా 9న ఆరోగ్య కేంద్రాలలో జరిగే పీఎంఎస్ఎంఏ కార్యక్రమానికి గర్భిణులను వెంట తీసుకొచ్చి వైద్యులతో పరీక్షలు చేయించాలని ఆదేశించారు. హైరిస్క్ గర్భిణులకు ట్యాగ్ చేయాలన్నారు. రక్తహీనతతో బాధపడే గర్భిణులు ప్రసవ సమయంలో, అవసరాన్ని బట్టి రక్తదానం చేసే బంధువులను సిద్ధపరచుకోవాలని ఆమె సూచించారు. ప్రతి ఒక్క గర్భిణి కనీసం ఒక్కసారైనా ఈ– సంజీవని యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని, వైద్యులు ఇచ్చిన ఆరోగ్య సలహాలు పాటించాలని తెలిపారు. టిఫా స్కాన్‌ను తప్పనిసరిగా సద్వినియోగం చేసుకోవాలని, అభ ఐడీలో నమోదు కావాలని సూచించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, డాక్టర్ సీహెచ్.రత్న మన్మోహన్, డాక్టర్ అన్నపూర్ణ, ఎస్ఓ పద్మజ పాల్గొన్నారు.

వైన్ షాపు ఏర్పాటుపై తెలుగు తమ్ముళ్ల అక్కసు

రెవెన్యూ, పోలీసు, ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు

చేబ్రోలు: మండలంలోని వేజండ్లలో వైన్ షాపును తొలగించాలని కోరుతూ టీడీపీ నేతలు రెవెన్యూ, పోలీసు, ఎక్సైజ్ అధికారులకు గురు, శుక్రవారాల్లో ఫిర్యాదు చేశారు. గత 30 ఏళ్లుగా గ్రామంలోని బొమ్మగుంట రోడ్డులో దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. ఇప్పుడూ అక్కడే నిర్వహించ తలపెట్టినప్పటికి టీడీపీ నేతల ఫిర్యాదు చేయడం వెనుక పలు కారణాలు ఉన్నట్లు తెలుస్తోంది. తమకు అనుకూలమైన వారికి దుకాణం రాలేదనే కారణంతో వరుసుగా ఫిర్యాదులు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. చేబ్రోలు ఎస్‌ఐ వెంకటకృష్ణకు, తహసీల్దారు శ్రీనివాసశర్మకు, ప్రత్తిపాడులోని ఎక్సైజ్ అధికారులకు టీడీపీ మండల అధ్యక్షుడు మైలా రామరాజుతో పాటు ఇతర నాయకులు ఫిర్యాదు చేసినవారిలో ఉన్నారు. మద్యం దుకాణం అనుమతి పొందిన వారు ప్రస్తుత్తం ఉన్న ప్రాంతం నుంచి వేరే చోటకు మార్చడానికి అంగీకరించినట్లు తెలిసింది. వారం రోజుల్లో మార్చుకోనున్నట్లు అధికారులకు తెలియజేయడంతో వారు అంగీకరించినట్లు తెలిసింది. దీంతో శుక్రవారం మద్యం దుకాణంలో అమ్మకాలు ప్రారంభించారు.

ఎన్జీ రంగా వర్సిటీలో మాన్యువల్ కౌన్సెలింగ్

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పరిధిలోని కళాశాలల్లో 3వ దశ ఎన్ఆర్ఐ కోటా మాన్యువల్ కౌన్సెలింగ్, బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్ మాన్యువల్ కౌన్సెలింగ్‌ను ఈనెల 22వ, 23వ తేదీల్లో నిర్వహించనున్నట్లు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి. రామచంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్‌ను ఉదయం 10 గంటల నుంచి కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ విశ్వవిద్యాలయం అడ్మిన్ ఆఫీస్, లాంఫాంలో నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు, చేయని అభ్యర్థులు వెబ్‌సైట్ నుంచి దరఖాస్తును డౌన్‌లోడ్ చేసుకుని, కౌన్సెలింగ్‌కు హాజరై సీట్లను పొందవచ్చని ఆయన తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు మరిన్ని వివరాలకు విశ్వవిద్యాలయం డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌జీఆర్ఏయూ.ఏసీ.ఇన్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని ఆయన సూచించారు.

రైల్వే ట్రాక్‌పై గుర్తు తెలియని యువకుడి మృతి



తాడేపల్లి రూరల్: తాడేపల్లి కృష్ణా కెనాల్ జంక్షన్ పరిధిలోని కృష్ణానది రైల్వే బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని రైలు ఢీకొని యువకుడి మృతిపై గుంటూరు రైల్వే పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. జీఆర్పీ సీఐ జి.అంజిబాబు మాట్లాడుతూ విజయవాడ నుంచి కృష్ణా కెనాల్ వచ్చే రైల్వే లైన్‌లో కృష్ణానది బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని యువకుడి మృతదేహం రైలు పట్టాలపై పడి ఉందని తెలిపారు. ఏ రైలు ఢీకొట్టిందో సమాచారం లేదని, మృతుడి వయస్సు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉండొచ్చని చెప్పారు. లేత నీలి రంగు టీషర్టు, బ్లూ కలర్ జీన్స్ ధరించి ఉన్నాడని, కుడిచేతిపై త్రిశూలం పచ్చబొట్టు ఉందని వివరించారు. ఆచూకీ తెలిసిన వారు 901099939, 9550523485 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

విజయవాడ నుంచే హజ్ వెళ్లే పద్ధతిని కొనసాగించాలి

వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్‌జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని



సమావేశంలో మాట్లాడుతున్న సుభాని

తాడేపల్లి రూరల్: ముస్లింలు పవిత్రంగా భావించే హజ్ యాత్రను విజయవాడ నుంచే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. దుగ్గిరాలలోని ముర్తుజానగర్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హజ్ యాత్రకు 50 ఏళ్లు పైబడిన పెద్దలే వెళ్తుంటారని, గతంలో వీరంతా హైదరాబాద్,బెంగళూరుకు ప్రయాణం చేయడానికి ఎంతో ఇబ్బందులు పడేవారన్నారు. ఈ విషయాన్ని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ముస్లిం పెద్దలు తీసుకువెళ్లారని, స్పందించిన ఆయన విజయవాడ విమానాశ్రయం నుంచే హజ్ యాత్రకు వెళ్లేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. టికెట్ ధర పెరగడం వల్ల ఒక్కో హజ్ యాత్రికునికి 83 వేల రూపాయల అదనపు భారం పడుతుండడంతో ఆ మొత్తం కూడా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం భరించి ఆర్థికంగా అండగా నిలిచిందని గుర్తు చేశారు. అదనపు ఆర్థిక భారాన్ని కూటమి ప్రభుత్వం భరిస్తుందో లేదో తెలియక ఈసారి వెళ్లేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపడం లేదని తెలిపారు. రాష్ట్రం నుంచి 101 మంది మాత్రమే పేర్లు నమోదు చేయించుకోవడం ఇందుకు నిదర్శమని పేర్కొన్నారు. హజ్ యాత్రికులకు ఆర్థిక సాయం అందిస్తామని గత ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఇచ్చిన హామీని అమలు చేసి అండగా నిలవాలని ఆయన కోరారు. సమావేశంలో మైనార్టీ నేతలు షేక్ రషీద్, షేక్ జాని, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

అమరావతి రైతుల కౌలు సమస్యలు పరిష్కరిస్తాం

సీఆర్డీఏ అదనపు కమిషనర్ ప్రవీణ్‌చంద్



రైతుల నుంచి సమస్యలు స్వీకరిస్తున్న ప్రవీణ్‌చంద్

తాడికొండ: రాజధాని అమరావతి ప్రాంతంలో రైతుల కౌలు సమస్యలను ఇప్పటికే కొన్ని పరిష్కరించి వారి ఖాతాల్లో నగదు జమచేశామని, మిగిలిన వారి సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని ఏపీ సీఆర్డీఏ అదనపు కమిషనర్ జి. సూర్యసాయి ప్రవీణ్‌చంద్ తెలిపారు. తుళ్ళూరు సీఆర్డీయే ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం జరిగిన గ్రీవెన్స్‌డేలో రాజధాని రైతులు వారి సమస్యలను అదనపు కమిషనర్‌కు విన్నవించుకున్నారు. ఆయన అధిక శాతం అక్కడికక్కడే పరిష్కార మార్గం చూపారు. మిగిలినవి వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సీఐడీ పరిధిలో ఉన్న కొందరి సమస్యలకు కూడా వెంటనే పరిష్కారం చూపుతామని ఆయన హామీ ఇచ్చారు. ప్రతి శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించనున్న గ్రీవెన్స్ డేను రైతులు వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో స్పెషల్ డెప్యూటీ కలెక్టర్లు ఎం. విశ్వేశ్వరనాయుడు, కె. స్వర్ణమేరి, బి. సాయి శ్రీనివాస్ నాయక్, జి. భీమారావు, డీసీడీవో బొర్రా శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరు పంచాయతీ కార్మికుల మృతి

- గుర్తు తెలియని వాహనం ఢీ
- తాడికొండ మండలం నిడుముక్కలలో ఘటన



ఘటనా స్థలంలో మృతదేహాలు

తాడికొండ: గుర్తు తెలియని వాహనం ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరు పంచాయతీ కార్మికులు మృతి చెందిన ఘటన తాడికొండ మండలం నిడుముక్కల గ్రామ పరిధిలో శుక్రవారం సాయంత్రం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుళ్ళూరులో పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేస్తున్న బత్తుల అయ్యప్ప(43), కంతేటి ఏసు(53) ద్విచక్ర వాహనంపై వెళుతున్నారు. నిడుముక్కల శివారు ప్రింటింగ్ ప్రెస్ సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఇద్దరు ఘటనా స్థలంలోనే ప్రాణాలొదిలారు. రోడ్డుపై మృతదేహాలు పడిఉన్న తీరుచూసి స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. గుర్తు తెలియని లారీ ఢీకొని ఉంటుందని స్థానికులు అనుమానం వ్యక్తం చేశారు. ఘటనా స్థలానికి తాడికొండ సీఐ కె. వాసు చేరుకొని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. బాధితుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు సీఐ తెలిపారు.

రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘం సంతాపం

ప్రమాదంలో మృతి చెందిన తుళ్ళూరు పంచాయతీ కార్మికులు అయ్యప్ప, ఏసులకు రాజధాని ఏరియా పారిశుద్ధ్య కార్మిక సంఘం తీవ్ర సంతాపం తెలియజేసింది. కార్మిక సంఘం గౌరవ అధ్యక్షుడు ఎం. రవి, చెరుకూరి సుశీల తదితరులు మాట్లాడుతూ మృతులు ఇద్దరూ పేద కుటుంబాలకు చెందిన వారని, ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని కోరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ APOSS ద్వారా డైరెక్ట్ - 10th / ఒకే సం॥లో ఇంటర్, దూరవిద్య ద్వారా BA/ B.Com, B.Sc/ M.A/ M.Sc/ MBA/ MCA. శ్రీ వర్షిని. 2/6, బ్రాడీపేట, గుంటూరు-2 ✆ 9440214612/ 9553534072/ 9652146801

REAL ESTATE

FLAT FOR SALE

■ తాడేపల్లి పాతూరు రోడ్డులోYSR బొమ్మ సెంటర్ దగ్గర, తూర్పు, పడమర ఫేసింగ్‌తో, గృహ ప్రవేశమునకు సిద్ధముగా 3BHK లగ్జరీ ప్రీమియం ఫ్లాట్స్ (4272 sft.) 2 కార్ల పార్కింగ్, అన్ని సౌకర్యములతో అమ్మకమునకు కలవు USD:135 చ॥గ॥ ✆ 92464 95388

■ వర్షిత నివాస్ : ఇన్నర్ రింగ్‌రోడ్డు రైల్వే గేట్ దగ్గర అత్యంత నాణ్యతతో గార్డెన్ & వాటర్ ఫౌంటెన్‌తో 2 BHK ఫుల్ ఫినిష్డ్ లగ్జరీ ఫ్లాట్స్ 42 లక్షలకే. ఫోన్ : 98481 10543, 88855 66088

LAND FOR SALE

■ విజయవాడ to హైదరాబాద్ హైవే ఫేసింగ్ కమర్షియల్ ల్యాండ్ 4 ఎకరాలు కలదు. ఐకానిక్ బ్రిడ్జికి 300 మీటర్స్‌లో కోర్ క్యాపిటల్ అమరావతికి 7కి.మీ దగ్గరలో. సెల్: 93477 56501.

TO-LET

■ అరండల్‌పేట 11/1 లో 6-11-42 నందు 1st ఫ్లోరు ఆఫీసు పర్పస్‌కు రెంట్‌కు ఇవ్వబడును. పార్కింగ్ సౌకర్యం కలదు. సంప్ర: 7396887273, 9492716403

■ తెనాలి మారీసుపేట ఎరువుల కొట్టు బజార్ అలీ బ్యాటరీ షాపు ఎదురుగా నూతనంగా నిర్మించిన 1700 Sft. 1st ఫ్లోర్, గ్రౌండ్‌ఫ్లోర్ కార్నర్ షాపులు-2 అద్దెకు ఇవ్వబడును. 9491581890

SERVICES

■ రుణాలు, వ్యక్తిగత, వ్యవసాయం, వ్యాపార రుణం, తక్కువ వడ్డీ రేటు, సిబిల్ అవసరం లేదు. NPA కూడ దరఖాస్తు చేసుకోవచ్చు. ఏజెంట్స్ కావలెను. అర్చన్‌ఫైనాన్స్,పార్తిబా. 8500236824.

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 91699 22299

■ బంగారం బ్యాంకులలో ఇతర సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్) ✆ 88024 89999

WANTED

■ తెనాలిలో MS Office, Excelలో అనుభవం ఇంగ్లీష్ టైపింగ్ వచ్చిన కంప్యూటర్ ఆపరేటర్స్ కావలెను. జీ: 10-15వేలు ఐతోనగర్, తెనాలి. లోకల్ వారికి ప్రాధాన్యం. 9490157852, 7815829957

■ 10th, ఇంటర్, డిగ్రీ, B.Tech చదివి ఖాళీగా ఉంటున్నవారికి ఆఫీసులు, షోరూమ్‌లు, షాపింగ్ మాల్స్, Ltd కంపెనీల్లో మా సంస్థ ద్వారా ప్లేస్‌మెంట్స్ కలవు. ఓన్లీ ఆఫీస్ వర్క్. 99632 55441

■ ప్రముఖ స్టార్ హోటల్ గీతా రీజెన్సీ నందు పని చేయుటకు వెజ్, నాన్‌వెజ్ కిచెన్ ఇన్‌చార్జ్, నాన్ వెజ్ చైనీస్ మాస్టర్స్, కిచెన్ అసిస్టెంట్స్, సౌత్ ఇండియన్ కర్రీ మాస్టర్స్, రెస్టారెంట్ వెయిటర్స్ & బాయ్స్, మెయింటెనెన్స్(ఎలక్ట్రీషియన్స్) మరియు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి మంచి అనుభవం ఉన్న కార్ డ్రైవర్స్ వెంటనే కావలెను. అనుభవమును బట్టి జీతం ఇవ్వబడును. సంప్ర: 4/1 అరండల్‌పేట, గుంటూరు. 99490 77525

■ ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు లేడి టెలికాలర్స్ (కాలర్) & రికవరీ ఎగ్జిక్యూటివ్స్ (కమీషన్) కావలెను. Age: 21-40, గుంటూరు. లోకల్ వారు మాత్రమే: 8121502699, 7075569996

■ ప్రముఖ కంపెనీకి మీ ఇంటివద్దనే ఉంటూ ఒక గంట పార్ట్‌టైం వర్క్ చేయుటకు M/F కావలెను. వీక్లీ పేమెంట్స్ వీక్లీ 4000/- వివరాలకు వాట్సాప్/ కాల్. సంప్ర: 98856 82589

■ Montessori EM School GNT Requires Teachers, Incharges and PET. Cont: 63050 28254

■ గుంటూరు సిటీలోని ప్రముఖ బార్ & రెస్టారెంట్ నందు పనిచేయుటకు వెయిటర్లు, క్లీనింగ్ స్టాఫ్ కావలెను. రూం+ భోజన సౌకర్యం కలదు. సంప్ర: 91603 20319

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు, వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692.

■ ప్రముఖ నిధి బ్యాంకు నందు పని చేయుటకు సేల్స్ మేనేజర్స్ & ఫీల్డ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం : Rs.18,000/- నుండి 28,000/- వరకు + ఇన్సెంటివ్స్. సెల్ : 83282 81861.

■ విజయవాడలో VIP పేషెంట్‌లను ఇంట్లోనే ఉండి చూసుకొనుటకు ICU ఎక్స్‌పీరియన్స్‌డ్ GNM, B.Sc నర్సింగ్ వాళ్ళు కావలెను. జీతం 25K-35K కాల్/ వాట్సాప్ ✆ 97050 35559, 91600 25559

■ త్రినేత్ర హోంకేర్‌లో వృద్ధులను, చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి, భోజనం జీ : 18K. Ph: 8520980099

సాక్షి క్లాసిఫైడ్స్
గుంటూరు ఎడిషన్
రూ.475/- మాత్రమే
ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే
ఈ సెల్‌నెంబర్లలో ప్రకటనల కొరకు సంప్రదించండి
గుంటూరు
7075167541
7075167663

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని ఉపయోగించుకుని పాఠకులు జాగ్రత్తగా వ్యవహరించాలి. ప్రకటనకర్తలు చెప్పే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తాపత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.